56

# ఆర్చేదెవరు? తీర్చేదెవరు?

ఇప్పుడంటే మనకు కాగితాలూ, అచ్చుయంత్రాలూ వచ్చాయి గనుక, పుస్తకాలు, పత్రికలూ అచ్చయి, అన్ని సమాచారాలూ, అందరికీ అందుబాటులోకొస్తున్నాయి. అచ్చు యంత్రం రాక ముందు సంగతేమిటి?

అప్పుడేమో, కాగితం ఉండేది దాని మీద కరక్కాయ రసంతో, పక్షి ఈకలతో రాస్తూ ఉండేవారు. ఇంతకన్నా ముందు, ఆకులమీద- ముఖ్యంగా తాటి ఆకులమీద మొనగలిగిన ఉక్కు గంటంతో రాసేవారు. ఈ దశకన్నా ముందు దశలో మట్టిని పలుచని బిళ్లలుగా మలిచి, అవి కరపచ్చిగా ఉన్నప్పుడే, కోసుగా ఉండే ఏ పుడకతోనో తాము చెప్పదలచుకొన్నదాన్ని వాటిమీద రాసి, ఆరబెట్టి, దోరగాల్చి భద్రపరచుకొనే వారు.

మరి ఇంతకు పూర్వం మాటేమిటి? అప్పటి వారికి మాట లేదా? పాటలేదా? ఆటలేదా? మానవుడు కొండగుహల్లో నివసించే రోజుల్లోనూ సామూహికంగా పాడుకొనేవారనీ, ఆడుకొనేవారనీ చెబుతారే? ఒక్కోతెగకు సంబంధించిన సాహస కృత్యాలు, వీరగాధలు, అలా అలా పాకి పాకి, ఒక సమూహంనుండి మరో సమూహానికి చేరుకొంటూ ఉండేవని అంటారే? నిజమే!

వీరగాధలను గానం చేస్తూ, ప్రచారం చేస్తూ, అదే వృత్తిగా బతికిన తెగలు, కొన్ని అనాది కాలం నుండి ఉన్నాయి. అసిరస్ దేవుని అద్భుత గాధలను గొంతెత్తి పాడుతూ, ఊరూరూ, ఇల్లిల్లూ తిరిగే చారణులు, ఆనాడు గ్రీకు దేశమంతటా ఉండేవారని చరిత్ర చెబుతున్నది. ఇదేదో ఆ దేశానికే పరిమితం కాదు. ఇటువంటి దశను ప్రపంచ దేశాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవించనే అనుభవించాయి.

కాస్త అటూ యిటూగా మన దేశంలోనూ యిటువంటి చారణులు వున్నారు. మధ్య యుగాల్లో ఈ జాతులవారిని రాజులూ, మహారాజులూ పోషిస్తూ ఉండేవారు. ప్రభువుల బలపరాక్రమాదుల్ని కమ్మని కథలుగా మలిచి, వీరాద్భుత రసాల్ని జోడించి వాడవాడా ప్రచారం చేయడమే వీరి పని. ఇందుకోసం అంతో యింతో ప్రతిఫలం ప్రభువులనుండి వీరికి ముడుతూ ఉండేదేమో! రాను రాను యిదొక వృత్తిగా మారిపోయింది. ఈ వంశీయులకు యిది తప్ప మరేమీ చేతకాని దశ సంభవించింది.

'పంబ, పిచ్చుగుంట,' 'వీరముష్టి' మొదలయిన తెగలవారు ఈ కోవలోకి వస్తారు.

ఇదంతా ఈ భషలోనే రాంకిష్టయ్య చెప్పలేదు గానీ, అతను చెప్పిందాని సారాంశం మాత్రం యిదే!

"మా ముత్తాత, మా తాత, మా అయ్య ఈ పని చేశారు. ఇదిగో- నా హాయంలోనే ఇది నాశనమయిపోయింది" అన్నాడు రాంకిష్టయ్య బాధగా.

రాంకిష్టయ్యకు తన తాతగారి కథల సంగతి అంతగా గుర్తులేదు గానీ, తండ్రి సంగతి మాత్రం బాగా జ్ఞాపకముంది. తాతగారు బాగా కథలు చెప్పేనాటికి రాంకిష్టయ్య చిన్నవాడు. అతనికి కాస్త ఊహవచ్చే నాటికే సింగయ్య ఉసిలిపోయాడు. అప్పటికీ, అప్పుడప్పుడూ గొంతు కలుపుతూ ఉండేవాడుట.

"నీరుకావి పంచ, మోకాళ్ళదాకా తలగుడ్డ చుట్టూవాడు. పట్టెనామాలు పెట్టుకొనేవాడు. మెళ్ళో పూసల పేరూ ఉండేది. ఏకతార మీటుకొంటూ రామాయనం చెప్పేవాడు. భారతం చెప్పేవాడు. మాలక్షమ్మ కథ చెప్పేవాడు..."

రాంకిష్టయ్య ఓ నిమిషం ఆగాడు. అతని కళ్ళు తళుక్కుమన్నాయి. ఒక్కసారి ఏకతారను మీటి, కాళీగా వున్న జూవెను అటూ యిటూ కదిపాడు.

"ఆ కాలమే వేరు. ఆ రోజులే వేరు. ఇప్పుడంతా మిడిమాలపు సరుకు బాబుగారూ. ఓ భయంలేదు. భక్తిలేదు. చూస్తూ చూస్తూ ఉండగానే నా కళ్ళముందే లోకం పాడయి పోయిందండి" ఇట్టి మారుతున్న సమాజంపై అతని వ్యాఖ్య.

తమకో ఊరంటూ లేదన్నాడు. తమ పూర్వీకులది కర్నూలు జిల్లా అన్నాడు. కొంతమంది మాచెర్ల దగ్గరా, ఇంకొంత మంది కనిగిరి ప్రాంతంలోనూ ఉన్నారన్నాడు. వాళ్ళయినా ఇప్పుడీ వృత్తిలోలేరనీ, చదువుకొని, ఏవో పనిపాట్లు చేసుకొంటున్నారనీ అన్నాడు. ఇంకొంత మంది కూలీ నాలీ చేసుకొని బతుకుతున్నారట.

"నేనే ఇంకా దీన్ని వదల్లేకుండా ఉన్నానండీ!... కారణం నాకే తెలియదు. ఈ వృత్తి మీద గౌరవం అలాంటిది. తరతరాలనుంచీ నమ్ముకొన్న వృత్తి. పిడికెడు అన్నం పెట్టకపోదన్న నమ్మకం నాకింకావుంది" అన్నాడు రాంకిష్టయ్య "ఇదే మావాడితో వచ్చిన సావండీ!" అన్నాడు బలేరాముడు.

అసలు పేరు బలరాముడు అయివుండాలి. అప్పుడప్పుడు 'బలే రాము'డని, 'బాలిరాముడ'ని రాంకిష్టయ్య సంబోధించాడు. ఆ మాటకొస్తే తన పేరు కూడా 'రామకృష్ణయ్య' అయి వుండాలి.

"ఊరి నడి మధ్య ఏ గుంటలమ్మ చెట్టుకిందో, పోలేరమ్మ గుడిముందో రచ్చబండ దగ్గరో, రాత్రి తెల్లవార్లూ కథలు చెప్పేవాళ్ళం. అటూ, యిటూ రెండు కాగడాలు, కథసందర్భాన్ని బట్టి. ఈ దివిటీలమీద అప్పుడప్పుడు గుగ్గిలపొడి చల్లుతుండేవాళ్ళం. ఒక్కో ఊళ్ళోనండీ వారమేసి రోజులూ పదేసి రోజులూ కథలు చెప్పే వాళ్ళమండీ" అన్నాడు రాంకిష్టయ్య.

"ఆ కథలకు ఊళ్ళో వున్న పిల్ల, జెల్లా, ముసలి, ముతకా అందరూ హాజరయ్యేవారు. కథలకు ఊరి వాళ్ళు పోటీలుపడి మరీ భోజనాలకు పిలచేవాళ్ళు. ఆఖరు రోజున తలా పావలా, బేడా, గుడ్డ గుడుసూ ఇచ్చి పంపేవారు.

ఒక్కోసారి ఏదో ఒక ఊళ్ళో కాకుండా మూడు నాలుగు గ్రామాల పొలిమేర దగ్గర కథ చెప్పేవారు. తెల్లవారు జాముదాకా జరిగే ఈ కథా కాలక్షేపం తరువాత- అటునుండి అటే పొలాలకు పన్లకూ పోయేవారు.

ఇప్పుడలా కథలు చెప్పించుకొనేవాళ్ళూ లేరు. చెప్పినా వినేవాళ్ళూ లేరు" అన్నాడు బలరాముడు.

"వయస్సులో సగభాగం, ఊరూరా తిరగడంతో గడిచింది. ఇప్పుడూ తిరుగుతున్నామనుకోండి. కథలూ-గిథలూ జాంతానై. ఏవో నాలుగు తత్వాలు పాడతాం. దయగలతల్లి గుప్పెడు గింజలు విదిలస్తుంది. లేకపోతే అదీ లేదు.

... ఆడవాళ్లు మా కథల్లోకి రారండి! చిన్న పిల్లలుగా వున్నప్పుడు గొంతు కలిపితే

కలుపుతారేమోగానీ ఈడేరినవాళ్ళను కాగడాముందుకు రానివ్వం... ఎందుకో నాకూ తెలియదు. మా అమ్మ రాలేదు. నా పెళ్ళాం రాలేదు'' అన్నాడు బలరాముడు రుసరుసలాడుతూ.

రాంకిష్టయ్యకి ఆరుగురు పిల్లలు. బలరామునికి ముగ్గురు పిల్లలు వున్నారిప్పుడు. ఆకలంటే, దరిద్రమంటే ఎరగని తమ చిన్నతనానికి ఉన్నదేదో బిడ్డలకింత పెట్టి, చెంబెడు నీళ్ల త్రాగి కరకరలాడే పేగులతో ముడుచుకు పడుకొనే ఈ ముదనష్టపు కాలానికి సాపత్యమే లేదని రాంకిష్టయ్య అభిప్రాయం.

''పుణ్యం పుచ్చిపోయింది, పాపం తెగ పెరిగిపోతున్నది. దేవుడు గుళ్ళకే దీపం పెట్టే దిక్కులేదు. అనగూడదుకానీ అక్కడే తాగుతున్నారు. అక్కడే జూదమాడుతున్నారు. నానా అంకఛండాలం పనులూ చేస్తున్నారు. ఈ ప్రపంచం యింకా ఎక్కువ కాలం ఇట్లా వుండదు. బ్రహ్మంగారు చెప్పినట్టు ఎప్పుడో పుటిక్కిన మునిగిపోతుంది'' అని జోస్యం చెప్పాడు రాంకిష్టయ్య.

తన గొంతు జోడించి శపించాడు బలరాముడు.